## రాష్ట్రానికి సీఎఫ్‌సీ, ఈఎంసీ మంజూరు

- కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వశాఖ వెల్లడి
- కేసీఆర్ ప్రభుత్వ కృషి ఫలితమే

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రానిక్స్ రంగం అభివృద్ధి కోసం తెలంగాణకు కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ)తోపాటు ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)ను మంజూరు చేసినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్ రాయదుర్గ్‌లోని నాలెడ్జ్ సిటీలో సీఎఫ్‌సీ ఏర్పాటుకయ్యే రూ.104.63 కోట్లలో గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా రూ.75 కోట్లు అందజేయనున్నట్టు ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ వెల్లడించింది. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో ఈఎంసీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను ఆమోదించామని, ఈ ప్రాజెక్టుకు అయ్యే రూ. 568.9 కోట్ల వ్యయంలో రూ.264.6 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద అందజేయనున్నామని తెలిపింది. తెలంగాణలో ఎలక్ట్రానిక్స్ రంగం అభివృద్ధి కోసం 2014 నుంచి ఇప్పటివరకు కేంద్రం అందించిన సహకారంతోపాటు ఐటీఐఆర్ పురోగతిపై సమాచారం ఇవ్వాలని సమాచార హక్కు కార్యకర్త ఇనగంటి రవికుమార్ కోరడంతో కేంద్రం ఈ వివరాలను వెల్లడించింది.

### కేంద్రానికి కేటీఆర్ లేఖలు

ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించాక తెలంగాణలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగం అభివృద్ధికి గత కేసీఆర్ ప్రభుత్వం విస్తృత కృషి చేసింది. అందులో భాగంగా మహేశ్వరంలో 2 ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను, మహబూబ్‌నగర్‌లోని దివిటిపల్లిలో మరో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఐటీఐఆర్ ప్రాజెక్టు కోసం తీవ్రంగా శ్రమించింది. ఈ క్రమంలోనే రాయదుర్గ్‌లో సీఎఫ్‌సీ, దివిటిపల్లిలో ఈఎంసీ ఏర్పాటు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, ఐటీఐఆర్ ప్రాజక్టును పునరుద్ధరించాలని కోరుతూ అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు కేంద్రానికి పలుమార్లు లేఖలు రాయడమే కాకుండా స్వయంగా కేంద్ర మంత్రులనూ కలిశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ రంగం అభివృద్ధికి కేంద్రం చర్యలు చేపడుతున్నది.

స్కూటర్‌పై తరలిస్తుండగా బాలానగర్ వంతెనపై చెల్లాచెదురుగా పడిన ప్రజాపాలన దరఖాస్తులు. ఏరి అట్టపెట్టెలో సర్దుకుంటున్న యువకుడు

# రోడ్డెక్కిన ప్రజాపాలన

మొదటిపేజీ తరువాయి...

గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ వరకు కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీల కోసం కోట్లాది మంది నిరుపేదల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ప్రజలు పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో ఉండి దరఖాస్తులు సమర్పించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల్లోని వివరాలన్నింటినీ ఈ నెల 17వ తేదీలోపు కంప్యూటరీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన దరిమిలా గ్రేటర్ పరిధిలోనూ అధికారులు ఆ ప్రక్రియ చేపట్టారు. ఇందుకోసం గ్రేటర్‌వ్యాప్తంగా 3,500 మంది ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చామని, ఎక్కడికక్కడ జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో కంప్యూటరీకరిస్తున్నట్టుజీహెచ్ఎంసీ అధికారులు కూడా ప్రకటించారు.

### అసలేం జరిగింది?

బాలానగర్ ఫ్లైఓవర్‌పై ఓ యువకుడు స్కూటీ (ఏపీ 39 హెచ్‌హెచ్ 6455)పై అట్ట పెట్టెలో వేలాది దరఖాస్తులను కుక్కి తీసుకెళ్తున్నాడు. సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో తాడు తెగడంతో అందులోని కాగితాలన్నీ రోడ్డుపై గాలికి కొట్టుకుపోయాయి. అతడి ముందు, వెనక ఉన్నవారు ఒక్కసారిగా వాహనాలు ఆపి, ఆ యువకుడికి సహాయం చేసేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగా ఓ యూట్యూబర్ కూడా ఆ కాగితాలను తెచ్చి ఇచ్చే క్రమంలో అవేంటని చూసి అవాక్కయ్యాడు. ప్రజాపాలన కింద నిరుపేదలు దరఖాస్తు చేసుకున్న అభయహస్తం ఫారాలు అని గుర్తించాడు. వెంటనే స్కూటీపై ఉన్న యువకుడిని నిలదీశాడు. ఈలోగా ఇతర వాహనదారులు కూడా ఆ చుట్టుపక్కల కొట్టుకుపోయిన కాగితాలను తీసుకువచ్చి వాకబు చేశారు. ఇవన్నీ ప్రజాపాలన దరఖాస్తులని తెలుసుకొని 'కోటి ఆశలతో పేదోళ్లు అప్లై చేస్తే ఎక్కడికి తీసుకుపోతున్నావ్' అంటూ ప్రశ్నించారు.

> **ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చాం**
>
> ఈ ఘటనపై 'నమస్తే తెలంగాణ' హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా... ప్రజాపాలన దరఖాస్తులను ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చిన విషయం వాస్తవమేనని అంగీకరించారు. అందులో భాగంగానే హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో వచ్చిన దరఖాస్తు ఫారాలను కూకట్‌పల్లిలో ఒక ఏజెన్సీకి ఇచ్చి కంప్యూటరీకరిస్తున్నామని చెప్పారు. ఇదే విషయంపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.
>
> - హయత్‌నగర్ డీసీ రవీందర్‌కుమార్

అవి హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో నిరుపేదలు సమర్పించిన దరఖాస్తులని గుర్తించారు. వాహనదారులు, యూట్యూబర్ నిలదీయడంతో తాను పాన్ డబ్బాలో పని చేస్తానని సదరు యవకుడు పేర్కొన్నాడు. మరి హయత్‌నగర్‌కు చెందిన దరఖాస్తులు ఎక్కడికి తీసుకుపోతున్నావని ప్రశ్నించగా... పొంతనలేని సమాధానాలు ఇచ్చాడు. ఒకసారి ఈసీఐఎల్‌కు చెందిన వ్యక్తినని, మరోసారి రామాయంపేటకు చెందిన వ్యక్తిగా చెప్పాడు. అందరూ గట్టిగా నిలదీయడంతో తనకేమీ తెలియదని, లోకేషన్ మ్యాప్ ద్వారా వీటిని తరలిస్తున్నాననే విషయాన్ని స్పష్టం చేశాడు.

### ఇదీ అసలు కథ!

వాస్తవానికి ప్రభుత్వ కార్యాలయాల్లో జీహెచ్ఎంసీ శిక్షణ ఇచ్చిన ఆపరేటర్ల ద్వారా కంప్యూటరీకరించాల్సిన ప్రజాపాలన లబ్ధిదారుల వివరాలను ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కంప్యూటరీకరిస్తున్నారు. గతంలో కూకట్‌పల్లి జోనల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన రవీందర్‌కుమార్ కొంతకాలం కిందట ఎల్బీనగర్ జోన్‌కు బదిలీ అయ్యారు. హయత్‌నగర్ సర్కిల్ డీసీగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తన పరిధిలోని దరఖాస్తు ఫారాలను జాగ్రత్తగా, తన కార్యాలయంలోనే కంప్యూటరీకరించాల్సింది పోయి.. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో వాటిని పెట్టి చేతులు దులుపుకోవాలని చూశారు. ఇందులో భాగంగా కూకట్‌పల్లి సంగీత్‌నగర్ దగ్గర ఒక ప్రైవేటు ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకొన్నట్టు తెలిసింది. ఈ మేరకు కనీసం తానుగానీ, తన సిబ్బందితో గానీ ఆ ఫారాలను పంపకుండా.. ర్యాపిడో బుక్ చేసి మరీ తరలిస్తున్నట్టు తేలింది. కాగా, రోడ్డుపై పడ్డ కొన్ని దరఖాస్తులను వాహనదారులు ఏరి తీసుకొచ్చి ఇచ్చినా.. ఇంకా ఎన్ని దరఖాస్తులు గాలికి కొట్టుకుపోయాయో తెలియకపోవడం గమనార్హం.

### బాలానగర్ రోడ్డుపై నా దరఖాస్తా?

బాలానగర్ ఫ్లైఓవర్‌పై గాలికి కొట్టుకుపోయిన దరఖాస్తుల్లోని ఒక ఫారంలోని వివరాలు పరిశీలించి.. అందులోని లబ్ధిదారుడికి ఫోన్ చేయగా శ్రీనివాస్ అనే వ్యక్తి స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల కోసం ఈ నెల 6న తన తల్లి రావుల సునీత పేరు మీద దరఖాస్తు చేసినట్టు చెప్పారు. హయత్‌నగర్ పరిధిలోని ఖాదీ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న తాము హయత్‌నగర్‌లోనే ప్రజాపాలన పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో దరఖాస్తును అధికారులకు అందజేశామని తెలిపారు. 'అక్కడ అధికారులకు స్వయంగా అందజేసిన దరఖాస్తు బాలానగర్‌లో ఎందుకు రోడ్డు మీద పడిపోతుంది?!' అని ఆశ్చర్యపోయారు. మహాలక్ష్మి పథకం కింద తన తల్లికి నెలకు రూ.2500 వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నట్టు చెప్పారు.

# సీఎం పదవికి భట్టి అర్హుడే

- పార్టీలో విజన్, కమిట్‌మెంట్, అనుభవం ఉన్న నేత
- ఆయన సీఎం అవుతారనే మా కార్యకర్తలు కష్టపడ్డారు
- సీఎల్పీ నేతగా ప్రకటిస్తారని టీవీ ఎదుటే కూర్చున్నాం
- భట్టి పేరును ప్రకటించకపోవడం బాధ కలిగించింది
- యూట్యూబ్ ఇంటర్వ్యూలో డిప్యూటీ సీఎం సతీమణి నందిని

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సీనియర్ నేత, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్యమంత్రి పదవికి అర్హుడేనని ఆయన సతీమణి నందిని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీలోనే మంచి విజన్, కమిట్‌మెంట్, అనుభవం ఉన్న నేత భట్టి అని చెప్పారు. ఓ యూట్యూట్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. 'భట్టి విక్రమార్కను సీఎం చేస్తారని అనుకున్నాం. పార్టీలోనే మంచి విజన్, కమిట్‌మెంట్, అన్ని రకాల అనుభవం ఉన్న నాయకుడు సీఎం అయితే మధిర, ఖమ్మం జిల్లానే కాకుండా యావత్తు తెలంగాణ బాగుపడుతదని, పేద ప్రజల జీవితాలు మారుతాయనే ఉద్దేశంతో కార్యకర్తలు రాత్రి పగలు ఎంతో కష్టపడి పని చేశారు. సీఎల్పీ నేతగా భట్టిని ప్రకటిస్తారని ఎంతో ఆశగా కుటుంబ సభ్యులమంతా ఆ రోజు టీవీ ముందే కూర్చున్నాం. భట్టి పేరును ప్రకటించకపోవడంతో నా రక్తం చల్లబడిపోయింది. ఒక్కసారిగా కుప్పకూలిపోయినట్టయింది. ఆ వార్తను జీర్ణించుకోలేక ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయా. మనసు కుదుటపర్చుకొని తిరిగి ఇంటికొచ్చా. కార్యకర్తలు, కుటుంబ సభ్యులు అధైర్యపడొద్దనే ఉద్దేశంతో లేని నవ్వును ముఖంపై తెచ్చుకొని వారిని ఓదార్చా. ఏది జరిగినా మన మంచికే జరిగిందని, దీనికి ఎదురుతిరుగలేమని, వచ్చిన దాన్నే సంతోషంగా స్వీకరించాలని వారికి చెప్పా' అని పేర్కొన్నారు. అయితే, పార్టీ కోసం 10 ఏండ్లపాటు భట్టి విక్రమార్క పడ్డ కష్టం మామూలు కష్టం కాదని పేర్కొంటూ భావోద్వేగానికి గురయ్యారు.

## వారు మంత్రి పదవులతో సంతోషపడాలి!

ఖమ్మంలో ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుపై నందిని కీలక వ్యాఖ్యలు చేశారు. పారాచ్యూట్ నేతలు వారి కుటుంబ సభ్యులకు కూడా టికెట్లు అడుగుతున్నారని ప్రశ్నించగా.. 'వారు.. ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చారు. ఆ సమయంలో వారు బలమైన నాయకులు కావడం వల్ల పార్టీలోకి తీసుకున్నాం. అయినప్పటికీ మేము పదేండ్లపాటు కాపాడిన క్యాడరే వారిని గెలిపించింది. వారికి మంత్రి పదవులు కూడా ఇచ్చాం. ఇంతకన్నా వాళ్లు ఎక్కువ ఆశించకూడదు. అధిష్ఠానానికి కూడా కొన్ని రూల్స్ ఉంటాయి. వారికి దక్కిన వాటితో సంతోషపడాలి' అని వ్యాఖ్యానించారు. ఖమ్మం ఎంపీగా నందిని పోటీ చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై యాంకర్ ప్రశ్నించగా.. 'ఆ ప్రచారం ప్రజల నుంచి వచ్చింది. అది ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలు కోరుకుంటే ఎవరూ ఆపలేరు' అని తన మనసులో మాట బయటపెట్టారు. తాను కూడా ఖమ్మం ఎంపీ బరిలో ఉంటాననే సంకేతాలు ఇచ్చారు.

## అప్పు ఎట్ల తీరుస్తరు.. హామీలెట్ల అమలు చేస్తరు?

**బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి**

హైదరాబాద్, జనవరి8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం అప్పుల్లో ఉందని చెప్తున్న ప్రభుత్వం వాటినెలా తీరుస్తుందని, ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలవాలన్న అంశంపై కోర్‌కమిటీ సమావేశంలో చర్చించినట్టు తెలిపారు. రాష్ట్రం నుంచి ఎక్కువమంది బీజేపీ ఎంపీలు గెలిస్తే ఎక్కువ నిధులు వస్తాయని, కాబట్టి ఆలోచించి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈటల రాజేందర్‌తో తనకు విభేదాలు ఉన్నట్టు వస్తున్న వార్తలపై స్పందిస్తూ అలాంటిదేమీ లేదని, అందరితో కలిసే ఉంటానని బండి తెలిపారు. పార్టీ శాసనసభ్యులను పార్లమెంట్ ఇన్‌చార్జీలుగా నియమించామని, మరో రెండు రోజుల్లో పార్లమెంటు కన్వీనర్లను నియమిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకోవడంపై కోర్‌కమిటీలో చర్చించినట్టు తెలిపారు. సంక్రాంతి తర్వాత ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలకు పార్టీ ఇన్‌చార్జీలను నియమించినట్టు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# వర్సిటీ భూములు హైకోర్టుకు ఇవ్వొద్దు

- వీసీ చాంబర్ ఎదుట ఏబీవీపీ ఆందోళన

వ్యవసాయ వర్సిటీ వీసీ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ)/వ్యవసాయ యూనివర్సిటీ: వ్యవసాయ వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దని, భూములను కేటాయిస్తూ ఇచ్చిన జీవో నంబర్-55ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాలయ ఝాన్సీ డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ వీసీ చాంబర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ.. రైతులు పండించే పంటకు లాభం చేకూర్చేందు, నూతన వంగడాల కోసం పరిశోధనకు ఎంతగానో వ్యవసాయరంగానికి మేలు చేకూర్చే భూములను హైకోర్టుకు కేటాయించవద్దని కోరారు. 35 ఏండ్లుగా వర్సిటీలో మెడిసినల్ ప్లాంట్స్, కూరగాయల విత్తనాలు లాంటి అనేక వంగడాలపై ఎన్నో రకాల పరిశోధనలు జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆగ్రో బయోడైవర్సిటీ కొనసాగుతున్న పార్కులో రాష్ట్ర హైకోర్టు కోసం దాదాపు 100 ఎకరాల భూమిని తీసుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించడం తగదని పేర్కొన్నారు. వ్యవసాయరంగాన్ని తుంగలో తొక్కి, గ్రామీణ ప్రాంత యువతను విద్యాకు దూరం చేయడానికి ప్రభుత్వం కుట్రపన్నుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సేట్ హాస్టల్స్ కన్వీనర్ జీవన్ మాట్లాడుతూ.. ఇప్పటికైనా సీఎం స్పందించి వర్సిటీ భూములను వెనక్కి ఇచ్చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని లేవనెత్తుతామని హెచ్చరించారు. ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థును పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాథ్, మనీషా, పృథ్వీరాజ్, సూర్యప్రకాశ్, మహేశ్, రాజు, సాయిరాం, హరిప్రసాద్ పాల్గొన్నారు.

### ఫైనాన్స్ కమిషన్ సభ్యకార్యదర్శిగా స్మితాసబర్వాల్ బాధ్యతలు

హైదరాబాద్, జనవరి8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా నియమితులైన స్మితాసబర్వాల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.

### అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్‌గా ప్రదీప్

అర్బన్ ఫారెస్ట్రీ (హెచ్ఎండీఏ) డైరెక్టర్‌గా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్వీ ప్రదీప్ కుమార్ శెట్టిని ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పనిచేసిన డాక్టర్ బీ ప్రభాకర్‌ను అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

# దరిగాం అడవుల్లో మరో పులి మృత్యువాత

- నాలుగు రోజుల్లో రెండు ఘటనలు
- ఉచ్చు పెట్టారా? విషప్రయోగమా?
- అటవీ అధికారుల అనుమానం

కుమ్రంభీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కాగజ్‌నగర్, జనవరి 8 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం దరిగాం అడవుల్లో మరో పులి మృత్యువాత పడిన విషయాన్ని అటవీ అధికారులు గుర్తించారు. సోమవారం సీసీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టెబ్రీవాల్, ఎఫ్ఆర్‌వో వేణుగోపాల్ సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. ఇదే ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం ఓ పులి కళేబరాన్ని గుర్తించిన విషయం తెలిసిందే. ఆ ఘటన వెలుగు చూసిన మరుసటి రోజే మరో పులి కళేబరం లభించడం ఆందోళన కలిగిస్తున్నది. రెండో పులికోసం గాలిస్తున్న ట్రాకింగ్ బృందానికి.. మొదట చనిపోయిన పులి ప్రాంతానికి కొద్ది దూరంలోనే చిన్న నీటి మడుగులో మరో పులి కళేబరాన్ని సోమవారం గుర్తించారు. పులుల మధ్య జరిగిన ఘర్షణలోనే ఇది కూడా మృత్యువాత ఉండవచ్చని భావిస్తున్నప్పటికీ ఇంకా నిర్ధారణ కాలేదు. రెండో పులి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన తరువాతే ధ్రువీకరించనున్నారు. అయితే అక్కడి పరిస్థితులను పరిశీలిస్తే వేటగాళ్ల ఉచ్చుకే ఈ పులి బలైనట్టు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘర్షణ పడిన రెండు పులుల్లో ఒక పులి చనిపోగా గాయపడిన రెండో పులి ఇదికాదని తెలుస్తున్నది. ఇది మగ పులి అని సమాచారం. అటవీ అధికారులు ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. ఘటనా స్థలానికి మీడియాను అనుమతించడం లేదు. అధికారికంగా ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. కాగజ్‌నగర్ డివిజన్‌లో వరుస ఘటనలు చోటుచేసుకోవడంతో అటవీ శాఖ అధికారులపై వేటు పడుతుందన్న ప్రచారం జరుగుతున్నది. మంగళవారం రాష్ట్ర స్థాయి అధికారులు ఇక్కడికి వచ్చి పరిశీలించనున్నట్టు సమాచారం.

### చిరుత దాడిలో ఆవు మృత్యువాత

గుడిహత్నూర్ : ఆదిలాబాద్ జిల్లాగుడిహత్నూర్ మండలం సంభుగూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల చిన్నమన్నూర్‌లో ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి ఆవును చంపేసింది. చిన్నమన్నూర్‌కు చెందిన పెందూర్ తిరుపతి ఆవులను గుట్ట వద్ద తన చేనులో మేపుతుంటాడు. ఆదివారం రాత్రి చేను వద్దే ఆవులను కట్టేసి, అక్కడే పడుకున్నాడు. రాత్రి 10 గంటల ప్రాంతంలో చిరుత ఆవుల మందపై దాడి చేసింది. ఓ ఆవు చనిపోయింది. సోమవారం ఉదయం అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. చిరుత దాడిలోనే ఆవు మృతిచెందినట్టు బీట్ ఆఫీసర్ కృష్ణనాయక్ తెలిపారు.

# శంషాబాద్ భూకబ్జాదారులకు చుక్కెదురు

- పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు
- రాష్ట్ర హైకోర్టు తీర్పు సమర్థన

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ భూకబ్జాదారులకు సుప్రీంకోర్టులో కూడా చుక్కెదురైంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)కి చెందిన శంషాబాద్‌లోని 50 ఎకరాలను కబ్జా చేసి తప్పుడు పత్రాలతో తెలంగాణ హైకోర్టులో భంగపడిన పిటిషనర్‌కు సోమవారం అత్యున్నత న్యాయస్థానంలోనూ ఎదురుదెబ్బే తగిలింది. భూఆక్రమణదారులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. హెచ్ఎండీఏకు అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎం దానకిశోర్ పర్యవేక్షణలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు సోమవారం సుప్రీంకోర్టుకు హాజరై శంషాబాద్ భూముల వివరాలను అందజేశారు. పిటిషనర్ తరపున అడ్వకేట్ ముకుల్ రోహిత్ వాదించగా.. హెచ్ఎండీఏ తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూద్ర, సుప్రీంకోర్టు అడ్వకేట్ ఆన్ రికార్డ్ డేవీన సక్సేనా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టులో జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సతీశ్‌చంద్రతో కూడిన డివిజనల్ బెంచ్ పిటిషనర్ ఎస్ఎల్ఎల్పీ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. కాగా, శంషాబాద్‌లో రూ.1,000 కోట్ల విలువైన 50 ఎకరాల హెచ్ఎండీఏ భూముల కబ్జాకు ఉమ్మడి రాష్ట్రంలో కొందరు ప్రయత్నించారు. బోగస్ కోర్టు ఉత్తర్వులతో కాజేసేందుకు ఇద్దరు వ్యక్తులు పన్నిన కుట్రను గత కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకోవడంతో పాటు హైకోర్టులో పక్కా ఆధారాలతో వాదించించింది. నిరుడు డిసెంబర్ 14న హైకోర్టు శంషాబాద్‌లోని 50 ఎకరాల భూములు హెచ్ఎండీఏవే తుది తీర్పును వెలువరించింది.

# ఫిబ్రవరి 9 నుంచి బుక్‌ఫెయిర్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్ నిర్వహించనున్నట్టు బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ తెలిపారు. సోమవారం బుక్‌ఫెయిర్ కార్యాలయంలో గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో పుస్తక ప్రదర్శన నూతన కార్యదర్శిగా ఆర్ వాసు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా 36వ బుక్‌ఫెయిర్ తేదీలను ఖరారు చేశారు. యేటా జరిగే తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్) స్టేడియంలోనే ఉంటుందని చెప్పారు. సమావేశంలో కోశాధికారి పీ రాజేశ్వర్‌రావు, మాజీ కార్యదర్శి శృతికాంత్ భారతి, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, కోయ చంద్రమోహన్, సహాయ కార్యదర్శి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.